క్లుప్తంగా

ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో అడ్మిషన్లు ప్రారంభం

నేరేడుచర్ల : వివిధ కారణాలతో చదువు మానేసిన వారికి తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే 2025–2026 సంవత్సరానికి గాను తెలంగాణ ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు జెడ్పీ ఉన్నత పాఠశాల కోఆర్డినేటర్ బట్టు మధు, సహాయ కోఆర్డినేటర్ నర్సింహారావు గురువారం తెలిపారు. చదువు మధ్యలో మానేసిన వారికి ఇది ఎంతో ఉపయోగకరమని, వెంటనే అడ్మిషన్లు తీసుకొని కోర్సులను పూర్తి చేయాలన్నారు. ఓపెన్ టెన్త్ అడ్మిషన్లకు రికార్డు షీట్ లేదా టీసీ, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రంతో పాటు పాస్ ఫొటోలను తీసుకురావాలని సూచించారు.

సేవాలాల్ సేన యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాలునాయక్



నియామక పత్రం అందుకుంటున్న బాలునాయక్

మఠంపల్లి : మండలంలోని లాలితండాకు చెందిన సేవాలాల్ సేన జిల్లా యూత్ అధ్యక్షుడు భూక్యా బాలునాయక్‌ను తెలంగాణ రాష్ట్ర యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమిస్తూ గురువారం ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవ్‌నాయక్ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా బాలునాయక్ మాట్లాడారు. హైదరాబాద్‌లో జరిగిన సేవాలాల్ సేన మహాసభలో రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవ్‌నాయక్, రాష్ట్ర ఇన్‌చార్జ్ మాళోతు సైదానాయక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

28న ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

కోదాడరూరల్ : మండల పరిధిలోని 16గ్రామాల్లో గత ఏడాది ఏప్రిల్ నుంచి ఏ ఈడాది మార్చి 31వరకు జరిగిన ఉపాధిహామీ పనులపై ఈ నెల 28న ఆర్డీఓ కార్యాలయంలో సామాజిక తనిఖీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వీవీ రాంచందర్‌రావు గురువారం తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కూలీలు సకాలంలో హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టులు అందజేత



విద్యార్థులకు టై, బెల్టులు అందజేస్తున్న ఎంఈఓ సత్యనారాయణరెడ్డి

నేరేడుచర్ల : మండలంలోని సోమారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 137మంది విద్యార్థులకు గురువారం మండల విద్యాశాధికారి సత్యనారాయణరెడ్డి చేతుల మీదుగా టైలు, బెల్ట్‌లు, గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం పాఠశాలల్లో కల్పిస్తున్న అనేక వసతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి తప్పని సరిగా పాఠశాలలకు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మయ్య, ఉపాధ్యాయులు అనూష, నాగయ్య, జైహింద్, అంజయ్య, ప్రదీప్ తదితరులున్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

గరిడేపల్లి : వర్షాకాలం సీజన్ ప్రారంభంకావడంతో డెంగీ, మలేరియా వంటి సీజనల్ జ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గురువారం మండలంలోని కేజీబీవీ హాస్టల్‌లో ఏసీఎం అనే మందును గోడలపై స్ప్రే చేయించినట్లు మండల వైద్యాధికారి నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ మందు స్ప్రే చేయడంతో దోమలు గోడలపై వాలితే అవి చనిపోతాయని అన్నారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి ఎ.రామకృష్ణ, ప్రిన్సిపల్ శైలజ, సెక్రటరీ నాగేశ్వర్‌రావు, ఏఎన్‌ఎం అంజలి, బిల్ కలెక్టర్ నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయాలి

మఠంపల్లి : మండల కేంద్రంలో నేడు నిర్వహించే సీపీఎం మండల మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు భూక్యా పాండునాయక్ అన్నారు. గురువారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. మండల వ్యాప్తంగా ఉన్న 13గ్రామ శాఖలకు చెందిన సుమారు 120 మంది సభ్యులు మహాసభలో పాల్గొంటారన్నారు. ఈ సభలో పార్టీ భవిష్యత్‌లో చేపట్టబోయే పోరాటాలకు రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట పార్టీ మండల కార్యదర్శి మాళోతు బాలునాయక్, నాయకులు శాగంరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, సయ్యద్‌రన్‌మియా, పాడిశెట్టి రాము, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు

- పాఠశాలల్లో నామమాత్రంగా ఏర్పాటు
- చెత్తాచెదారంతో దర్శనమిస్తున్న మైదానాలు
- ఆట వస్తువులు లేక ఆసక్తి చూపని క్రీడాకారులు



సీతరాంతండా పాఠశాలలో స్థలం లేకున్నా క్రీడామైదానం ఉన్నట్లు ఏర్పాటు చేసిన బోర్డు



కొమ్ము బండతండాలో ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన బోర్డు

చిలుకూరు : గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. అసంపూర్తి నిర్మాణాలు, కానరాని సౌకర్యాలతో ఆనవాళ్లు కోల్పోతున్నాయి. క్రీడా స్థలాలకు కేటాయించిన స్థలాలు పెంట దిబ్బలతో నిండిపోతున్నాయి. పాఠశాలలో ఏర్పాటు చేసిన స్థలాలు నిరుపయోగంగా ఉన్నాయి. మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణాలు పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవడంలో అధికారులు విఫలమయ్యారు. మండల పరిధిలోని 17 గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ స్థలాలు, పాఠశాలలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. పలు గ్రామాల్లో ప్రభుత్వ స్థలాల్లో పూర్తి చేసిన నిర్మాణాలు సైతం అనుకూలంగా లేక క్రీడాకారులు వినియోగించుకునే పరిస్థితులు లేకుండా పోయాయి.

అసంపూర్తి నిర్మాణాలు, అరకొర వసతులు..

క్రీడా ప్రాంగణాల్లో క్రీడాకారులకు అనువుగా ఉండే విధంగా ప్రభుత్వం పలు వసతులతో కూడిన నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. అందులో భాగంగానే క్రీడా ప్రాంగాణాల్లో స్వాగత బోర్డు, వివిధ రకాల క్రీడలకు సంబంధించిన ఆట స్థలాలు వాలీబాల్ కోర్టు, కబడ్డీ కోర్టు, ఖోఖో, లాంగ్ జంప్‌తో పాటు పలు ఆటలు ఆడుకునేందుకు వస్తువులతో పాటు అన్ని రకాల వసతులు కల్పించాల్సి ఉంది. దీంతో పాటు, వాకింగ్ ట్రాక్, వ్యాయామం చేసుకునేందుకు కూడా సౌకర్యాలు ఏర్పాటు చేయాలి. కాని క్షేత్రస్థాయిలో ఇవి అనుకున్న మేర కనిపించడం లేదు. క్రీడాప్రాంగణాలు ఏర్పాటులో పాలకుల ఆరంభంలోనే ఆర్భాటం కనిపిస్తోంది. నిర్మాణ సమయంలో తొలుత ఎంతో ఆసక్తి కనబర్చిన అధికార యంత్రాంగం తర్వాత అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. దీంతో చాలా చోట్ల అసంపూర్తి నిర్మాణాలే దర్శనమిస్తున్నాయి. మరికొన్ని చోట్ల అరకోర వసతులతో పిచ్చిమొక్కలు పెరిగి నిరుపయోగంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి, క్రీడా ప్రాంగాణాలను వినియోగంలోకి తీసుకురావాలని గ్రామీణ క్రీడాకారులు కోరుతున్నారు.

వినియోగంలోకి వచ్చేలా చర్యలు



గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగాణాలు పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చేలా ప్రత్యేక చర్యలు చేపడతాం. పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి గ్రామాల్లోని క్రీడా ప్రాంగణాలను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం

– గిరిబాబు, ఎంపీడీఓ, చిలుకూరు

మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకం



కమిషనర్ శ్రీనివాసరెడ్డికి వైద్యపరీక్షలు చేస్తున్న మండల వైద్యాధికారి వేణుగోపాల్

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమైందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీలో వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గురువారం పట్టణంలో మున్సిపల్ సిబ్బందికి లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో కమిషనర్ పరీక్షలు చేయించుకుని మాట్లాడారు. పారిశుద్ధ్య కార్మికుల మెరుగైన ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. మండల వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ.. సమాజంలో పరిశుభ్రమైన వాతావరణాన్ని నిర్వహించడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమైందన్నారు. అనంతరం దాదాపు 96మంది మున్సిపల్ సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని దోమల నివారణ, డ్రై డే కార్యక్రమాల ద్వారా సహకరిస్తున్న లింగగిరి పీహెచ్‌సీ సిబ్బందిని మున్సిపల్ కమిషనర్ సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్లు వేణుగోపాల్, యశ్వంత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, సీహెచ్‌ఓ పద్మ, సుమిత్ర, పీహెచ్‌ఎన్‌ఓ నూర్జహాన్ బేగం, నర్సింగ్ ఆఫీసర్లు రత్నమేరీ, శివకుమార్, ఎల్‌టీ రమేష్, ఇందిరాల రామకృష్ణ, ఉదయగిరి శ్రీనివాసు, విజయశ్రీ, ప్రశాంతి, వరలక్ష్మి ఉన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను కోరారు. గురువారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట తెలంగాణ గ్రామపంచాయతీ కార్మికుల వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం ఎంపీడీఓ లావణ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తిరపతయ్య, అస్సాన్‌మియా, వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి, మట్టయ్య, గౌస్‌మియా, రవి, నాగరాజు పాల్గొన్నారు.

కోదాడ పీఏసీఎస్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



కోదాడ పీఏసీఎస్‌ను సందర్శించిన ప్రతినిధులు, ఉమ్మడి జిల్లాలోని సంఘాల ఉద్యోగులు

కోదాడరూరల్ : అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తున్న కోదాడ వ్యవసాయ పరపతి సహకార సంఘాన్ని మిగిలిన సంఘాలు ఆదర్శంగా తీసుకోవాలని టెస్కాబ్ ప్రతినిధులు విజయశంకర్, సంపత్‌కుమార్ అన్నారు. గురువారం కోదాడ పీఏసీఎస్‌ను ఉమ్మడి నల్లగొండ పీఏసీఎస్‌లలో పనిచేస్తున్న సిబ్బంది శిక్షణలో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సంఘాలను ఎలా అభివృద్ధి చేసుకోవాలో వివరించారు. సహకార సంఘాలు వ్యవసాయ రుణాలే కాకుండా ఎంఎస్‌ఎంఈ పారిశ్రామిక, గృహ, వర్తకులకు, క్యాష్‌క్రెడిట్, విద్యారుణాలు, వ్యవసాయేతర, మల్టీపర్పస్ రుణాలను మంజూరు చేస్తూ వాణిజ్య బ్యాంకులకు ధీటుగా పనిచేయాలన్నారు. అప్పుడే సంఘాలు అభివృద్ధి చెందుతాయని, దీనికి పాలక వర్గ సభ్యులు, సిబ్బంది, రైతుల సమష్టి కృషి ఎంతో అవసరమన్నారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ఎరువులు, ధాన్యం గోదాములను వారు పరిశీలించారు. కార్యక్రమంలో సంఘం చైర్మన్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ కొండా సైదయ్య, వైస్ చైర్మన్ బుడిగం నరేష్, ఏజీఎం వెంకటేశ్వర్లు, మేనేజర్ అశోక్, ఫీల్డ్ ఆఫీసర్ రామకృష్ణ, సీఈఓ మంద వెంకటేశ్వర్లు, డైరెక్టర్‌లు తదితరులు ఉన్నారు.

ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేయాలి



సూపరింటెండెంట్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహిళా నాయకురాళ్లు

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్షురాలు టి.వెంకటచంద్ర కోరారు. గురువారం పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ఐద్వా ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి అనంతరం సమస్యలపై సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఆస్పత్రిలో నలుగురు ఎండీల, స్పెషలిస్టుల కొరత ఉందని, డీఎంఓ ప్లాంట్‌లో ఖాళీలు ఉన్నాయని అన్నారు. ముఖ్యంగా గర్భిణులకు స్కానింగ్ మిషన్, రేడియాలజిస్ట్, బ్లడ్ స్టోరేజీ యూనిట్ కూడా చాలా అవసరమని, ఆస్పత్రిలో సమస్యలన్నింటినీ పరిష్కరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు త్రివేణి, లింగమ్మ, ఆదిలక్ష్మి, లక్ష్మి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి



వసతులను పరిశీలిస్తున్న టీఆర్‌ఎస్‌వీ నాయకులు

నేరేడుచర్ల : ప్రభుత్వ పాఠశాలల్లో సరైన మౌలిక వసతులు కల్పించాలని టీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ షోయబ్, రాష్ట్ర నేత రాపోలు నవీన్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలను టీఆర్‌ఎస్‌వీ హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు పల్లెపంగ నాగరాజుతో కలిసి సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా మూత్రశాలలు, మరుగుదొడ్లు, తరగతి గదులు ఏర్పాటు చేయాలన్నారు. చాలా వరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని, అదే విధంగా క్రీడా మైదానాలు కూడా లేకపోవడంతో విద్యార్థులు క్రీడలపై ఆసక్తిని చూపడం లేదన్నారు. ప్రభుత్వం పాఠశాలలకు పూర్తిస్థాయిలో పుస్తకాలు అందించాలన్నారు. వారి వెంట టీఆర్‌ఎస్‌వీ నాయకులు ఇంజమూరి రాజేష్, సతీష్, భాస్కర్, భార్గవచారి, వెంకటేష్, సుమంత్, విజయ్‌కుమార్, చంద్రగిరి, జోసఫ్, రవి, మధు, శేఖర్, సతీష్, నరేందర్ తదితరులున్నారు.

ఫీజులపై నియంత్రణ కమిటీ ఏర్పాటు చేయాలి



రాష్ట్ర విద్యాశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ నవీన్ నికోలస్‌కు వినతిపత్రం ఇస్తున్న దుర్గాప్రసాద్

మునగాల : రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాలలపై సత్వరమే ఫీజుల నియంత్రణ కమిటీని ఏర్పాటు చేయాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు జిల్లేపల్లి దుర్గాప్రసాద్ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ నవీన్ నికోలస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మునగాలలో విలేకరులతో మాట్లాడారు. 2009 విద్యాచట్టం ప్రకారం 25శాతం రాయితీని కల్పించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాదిరిగానే తెలంగాణ ప్రభుత్వం కూడా నోటిఫికేషన్ విడుదల చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో ప్రైవేటు పాఠశాలలో విద్యనభ్యసించే వారి జీవన విధానాల ఆధారంగా ఫీజులు నిర్ణయించి అమలుచేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఎల్‌కేజీ, యూకేజీ, నర్సరీ ప్రవేశపెట్టాలని వినతిపత్రంలో కోరినట్లు ఆయన తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగుల సామూహిక జన్మదిన వేడుకలు



రిటైర్డ్ ఉద్యోగులను సన్మానిస్తున్న సభ్యులు

నేరేడుచర్ల : మండల కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో గురువారం పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో సామూహిక జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఒకే నెలలో జన్మించిన సరజాల కృష్ణారావు, పోతుగంటి సత్యనారాయణ, ఇంజమూరి లక్ష్మి, దుర్గన్న లను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి, చావ వీరభద్రరావు, శ్రీరామ్‌రెడ్డి, బుద్దారెడ్డి, రామస్వామి, సైదిరెడ్డి, రమణారావు, లక్ష్మారెడ్డి, బోస్, వెంకటేశ్వర్లు, థెరిసా తదితరులున్నారు.

డ్రగ్స్ నిర్మూలనలో భాగస్వాములు కావాలి



మునగాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ, సీఐ, ఎస్‌ఐలు, తదితరులు

కోదాడరూరల్ : డ్రగ్స్ నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, పట్టణ సీఐ శివశంకర్ అన్నారు. గురువారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా పోలీసులు, ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో వారు మాట్లాడారు. విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. మీ ప్రాంతాల్లో ఎవరైన డ్రగ్స్ విక్రయించినా, సేవించినట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సలీంషరీఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

మునగాల : సమాజంలో మత్తు, మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ నడుం బిగించాలని ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, సీఐ రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మాదకద్రవ్యాల నివారణలో భాగంగా పోలీస్, పంచాయతీరాజ్, విద్యాశాఖ ఆధ్వర్యంలో గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మోడల్‌స్కూల్, జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 300విద్యార్థులతో గణపవరం క్రాస్‌రోడ్డులో మానవహారం చేపట్టారు. అనంతరం ఎంపీడీఓ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి పిడతల వెంకటేశ్వర్లు, మునగాల, నడిగూడెం ఎస్‌ఐలు ప్రవీణ్‌కుమార్, అజయ్, ఎంపీఓ నరేష్, గ్రామపంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ బూర సైదయ్యగౌడ్, ఉపాధి ఏపీఓ శైలజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బెజవాడ సరిత, జెడ్పీ ఉన్నత పాఠశాల, మోడల్‌స్కూల్ ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశావర్కర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్ నివారణపై విద్యార్థులకు అవగాహన

మేళ్లచెరువు : మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలలో గురువారం విద్యార్థులు నో డ్రగ్స్ అనే అక్షరక్రమంలో నిల్చొని డ్రగ్స్ వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ పరమేష్ మాట్లాడారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటరెడ్డి, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

చిలుకూరు : డ్రగ్స్ నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎస్‌ఐ సురభి రాంబాబుగౌడ్, ఎంపీడీఓ గిరిబాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సునిత, ఉపేంద్ర, ఉపాధ్యాయులు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మఠంపల్లిలో డ్రగ్స్ నిర్మూలన ర్యాలీ

మఠంపల్లి : మండల కేంద్రంలో డ్రగ్స్ నిర్మూలనపై గురువారం పోలీసులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా స్థానికంగా పాఠశాలల్లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ పి.బాబు, పోలీసులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలన మనందరి బాధ్యత

నడిగూడెం : డ్రగ్స్ నిర్మూలన మనందరి బాధ్యత అని తహసీల్దార్ వి.సరిత అన్నారు. గురువారం మండల కేంద్రంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనపై మానవహారం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరిసింగ్, ఎస్‌ఐ గందమళ్లఅజయ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి రాయపు అజయ్‌కుమార్, డాక్టర్ హరినాథ్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ చింతల వాణి, శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్ రజిని, కాంగ్రెస్ నాయకుడు వేపూరి సుధీర్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

హుజూర్‌నగర్ : ప్రతిఒక్కరూ డ్రగ్స్, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీఐ చరమందరాజు అన్నారు. గురువారం పట్టణంలో సీఐ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలన అవగాహన ర్యాలీని నిర్వహించారు. అనంతరం డ్రగ్స్ నివారణపై అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, సీడీపీఓ విజ యలక్ష్మి, ఎంపీడీఓ లావణ్య, ఎంఈఓ సైదానాయక్, ఏఎస్‌ఐ బలరామ్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలన విద్యార్థులతోనే సాధ్యం

గరిడేపల్లి : మాదకద్రవ్యాల నిర్మూలన నేటి తరం విద్యార్థులతోనే సాధ్యమవుతుందని, అందుకు విద్యార్థులంతా నడుం బిగించాలని ఎస్‌ఐ చలికంటి నరేష్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని కల్మలచెరువు రోడ్డులో విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరోజ, ఎంఈఓ చత్రునాయక్, డాక్టర్ నరేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి తదితరులు పాల్గొన్నారు.



మేళ్లచెరువు : నో డ్రగ్ అనే ఆకృతిలో కూర్చున్న విద్యార్థులు



హుజూర్‌నగర్ : ర్యాలీలో పాల్గొన్న సీఐ, మున్సిపల్ కమిషనర్, సీడీపీఓ



కోదాడరూరల్ : అవగాహన ర్యాలీలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి



నడిగూడెం : మానవహారంలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు



చిలుకూరు : ర్యాలీలో పాల్గొన్న పోలీస్, ఐసీడీఎస్, మండల పరిషత్ అధికారులు



మఠంపల్లి : పోస్టర్లతో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు

సంక్షిప్త సమాచారం

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

హుజూర్‌నగర్ : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలులో చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకుడు దొడ్డ నర్సింహారావు అన్నారు. గురువారం పట్టణంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారుల, బీఆర్‌ఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాబోయే రోజుల్లో రైతులు ప్రభుత్వానికి కర్రుకాల్చి వాత పెట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు నగేష్ రాథోడ్, ముక్కలపల్లి రాంబాబు, కె.శ్రీనివాస్, వెంకీ, రాము పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలి

హుజూర్‌నగర్ : పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొండ హరీష్‌గౌడ్ అన్నారు. ప్రధాని మోదీ పిలుపుమేరకు మా కే నామ్ ఏక్ పేడ్ కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వార్షికోత్సవాలను విజయవంతం చేయాలి

కోదాడరూరల్ : ప్రజానాట్య మండలి 50వ వార్షికోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ భవన్‌లో జరిగిన తెలగాంణ ప్రజానాట్య మండలి జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో దొంతగాని సత్యనారాయణ, జంపాల మల్లయ్య, ధనుంజయనాయుడు, మేకల శ్రీనివాస్, లతీఫ్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

గరిడేపల్లి : మండల పరిధిలోని కీతవారిగూడెం గ్రామంలో గల అయ్యప్పస్వామి దేవాలయ వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు రాయప్రోలు భద్రయ్యశర్మ, శ్రీరామయ్యశర్మ ఉదయం సుప్రభాత సేవ, స్వామి వారికి మహాన్యాస పూర్వకంగా రుద్రాభిషేకం నిర్వహించారు. దేవాలయ అధ్యక్షుడు ముతినేని సోమయ్య–విజయ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నగదు బహుమతి అందజేత



నగదు బహుమతి అందజేస్తున్న హెచ్‌ఎం మధు

నేరేడుచర్ల : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇటీవల పదోతరగతి పూర్తి చేసుకున్న 5గురు విద్యార్థులు గణితంలో 92మార్కులకు పైగా సాధించారు. ఈ సందర్భంగా గణితశాస్త్రం ఉపాధ్యాయుడు కొణతం వెంకట్‌రెడ్డి అతడి తండ్రి కొణతం సత్యనారాయణరెడ్డి జ్ఞాపకార్థంగా ఆ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున నగదు బహుమతిని పాఠశాల హెచ్‌ఎం బట్టు మధు చేతుల మీదుగా గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అన్నపూర్ణ, మాధవి, నాగమణి, అఫ్రున్, భానుమతి, సరస్వతి, వీరబాబు, సైదులు, రశీద్‌ఖాన్, జానకిరాములు, శౌరీ, నర్సింహారావు, జానయ్య, రాంమ్మూర్తి, బాలు, శ్రీనివాస్‌రెడ్డి, లాలుసాహెబ్, నగేష్ తదితరులున్నారు.